క్లుప్తంగా

విద్యుత్ వైర్లు సరిచేశారు



లైన్లు సరిచేస్తున్న సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడ పంచాయతీ వెంకన్నగారిపేటలో పొలాల్లో విద్యుత్ వైర్లు వేలాడుతున్న అంశంపై 'ప్రమాదకరంగా విద్యుత్ తీగలు' అన్న కథనం ఇటీవల సాక్షిలో ప్రచురితమైంది. దీనిపై విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ఆదివారం విద్యుత్ తీగలు సరిచేశారు. లైన్లకు మరమ్మతులు నిర్వహించారు.

గురుకుల పాఠశాలకు కవల విద్యార్థుల ఎంపిక


అరుణ్‌కుమార్


అఖిల్‌కుమార్

జి.సిగడాం: మండలంలోని దవళపేట ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న కవల విద్యార్థులు బోర అరుణకుమార్, బోర అఖిల్ కుమార్‌లు గురుకుల విద్యాలయంలో 5వ తరగతికి ప్రవేశానికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఎం.దేశన్న ఆదివారం తెలిపారు. వీరి ఎంపిక పట్ల తల్లిదండ్రులు రాము, అమ్మన్నమ్మ సంతోషం వ్యక్తం చేశారు.

కూర్మనాథాలయానికి భక్తుల తాకిడి


ఆలయం వద్ద భక్తుల రద్దీ

గార: ఆది కూర్మక్షేత్రం శ్రీకూర్మంలో కూర్మనాథున్ని వైశాఖ మాస ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు శ్వేత పుష్కరిణిలో పుణ్య స్నానాలు ఆచరించి అనంతరం స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు లక్ష్మీసన్నిధి, వైష్ణవిదుర్గ, తాబేళ్లపార్కును సందర్శించారు. ఆలయ ఈవో కె.నరసింహానాయుడు భక్తులకు ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించారు.

బోరుకు మరమ్మతులు


బోరు బాగు చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: రాగోలు పంచాయతీ బీసీ కాలనీలో బోరు పనిచేయకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ గేదెల చెంగల్వరావు, పంచాయతీ కార్యదర్శి తిరుమలాదేవి ఆదివారం బోరుకు మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

బాబోయ్ దొంగలు!

- విలీన పంచాయతీల్లో వరుస చోరీలు
- తాళం వేసిన ఇళ్లే టార్గెట్
- పోలీసు గస్తీ పెంచాలంటున్న కాలనీవాసులు


ఇటీవల గోవిందనగర్‌లోని ఓ ఇంట్లో చోరీ జరిగిన దృశ్యం (ఫైల్)


నగరపాలక సంస్థ పరిధిలోని తిలక్‌నగర్



శ్రీకాకుళం రూరల్: విలీన పంచాయతీల్లో దొంగలు రెచ్చిపోతున్నారు. తాళం వేసిన ఇళ్లే టార్గెట్ చేసుకుంటూ వరుస చోరీలకు పాల్పడుతున్నారు. పగలు రెక్కీ నిర్వహించి రాత్రిపూట దర్జాగా దోచుకుపోతున్నారు. ఒకప్పుడు శ్రీకాకుళం రూరల్ పంచాయతీ పరిధిలో ఉంటూ తర్వాత నగర పాలక సంస్థలో విలీనమైన పంచాయతీ కాలనీల్లో మే నెలలో జరిగిన వరుస దొంగతనాలు స్థానికులకు కంటిమీదుకు కునుకు లేకుండా చేస్తున్నాయి. సదూర ప్రాంతాలకు వెళ్లాలంటేనే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని శ్రీలక్ష్మీనగర్, రాజీవ్‌నగర్, గోవిందనగర్, తిలక్‌నగర్ తదితర ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 10న లక్ష్మీనగర్‌లోని సీమెన్ ఇంట్లో 15 తులాల బంగారం, రూ.20 వేలు నగదును దుండగులు పట్టుకుపోయారు. ఈ నెల 22న గోవిందనగర్‌లో ఓ ఇంట్లో 6 తులాల బంగారం, 10 తులాల వెండిని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. రాజీవ్‌నగర్ కాలనీలోనూ ఇటీవలే చోరీ జరిగింది.

అంతర్రాష్ట్ర ముఠా పనేనా..

విలీన పంచాయతీల్లో దొంగతనాలుకు పాల్పడుతోంది అంతర్రాష్ట్ర ముఠా దొంగల పనేనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దొంగతనం జరిగిన తీరు తెన్నులు, ఎటువంటి ఆనవాళ్లు లేకుండా చోరీ చేయడం చూస్తే కరుడుగట్టిన నేరస్తులే ఈ దోపిడీలకు పాల్పడి ఉంటారన్న అనుమానాలు కనిపిస్తున్నాయి. ఉదయం పూట కాలనీల్లో రెక్కీ నిర్వహించడం, టూలెట్ బోర్డు పేరుతో ఉన్న ఇళ్ల వద్దకు వెళ్లి అద్దెకు కావాలని తిరగడం వంటివి నిత్యకృత్యంగా జరుగుతోంది. ఇదే అదునుగా రాత్రిపూట వరుస దొంగతనాలు జరుగుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

గస్తీ ఏదీ?

వాస్తవంగా దొంగతనాలు ఎక్కడ జరిగినా.. అందులో ప్రమేయమున్నది పాత నేరస్తుడా, కొత్తగా ఎవరైనా దొంగతనాలకు పాల్పడ్డారన్న విషయాలన్నీ సీసీఎస్ పోలీసుల క్రైం రికార్డుల్లో నమోదై ఉంటాయి. వీటి ఆధారంగా పోలీసులు పాత నేరస్తులు కదలికలపై నిఘాపెట్టాల్సిన అవసరం ఉంది. విలీన పంచాయతీల పరిధిలోని కాలనీల్లో దొంగతనం జరిగిందంటే సీసీఎస్ పోలీసులు చుట్టుపక్కలా నిఘా పెంచాల్సిన అవసరం ఉంది. నైట్ రౌండ్లు చేయాల్సిన సిబ్బంది ఎక్కువగా స్టేషన్‌కే పరిమితమవుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నగరంలో కాలనీల సంఖ్య బాగా పెరిగింది. రూరల్ స్టేషన్ పరిధిలోని ఒకరిద్దరు బీట్ కానిస్టేబుల్స్‌తో నైట్ బీట్ వేస్తూ తూతూమంత్రంగా ముగించేస్తున్నారు. దీనివల్ల ఏ కాలనీలో ఏం జరుగుతోందో చెప్పలేని పరిస్థితి కనిపిస్తోంది. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు విలీన పంచాయతీ కాలనీలపై దృష్టి సారించి దొంగతనాలను అరికట్టాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.

గస్తీ ముమ్మరం..

విలీన పంచాయతీల్లో గస్తీ ముమ్మరం చేశాం. ప్రతిరోజు నాలుగు నైట్ బీట్‌లు వేస్తున్నాం. ఒక్కో బీట్‌లో ఇద్దరు కానిస్టేబుల్స్ తిరుగుతుంటారు. ప్రతిఒక్కరూ భారీ భవనాలు కడుతున్నారు తప్ప సీసీ కెమెరాలు అమర్చాలనే ఆలోచన రావడం లేదు. వీటి వల్ల ఎక్కడ చోరీ జరిగినా దర్యాప్తు సులువు అవుతుంది. ఇటీవల జరిగిన దొంగతనాల్లో అనుమానితులను గుర్తించాం.

– పైడపునాయుడు, టౌన్ సీఐ

• 'నాన్‌స్టాప్' రద్దీ



జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆదివారం ప్రయాణికులతో కళకళలాడుతూ కనిపించింది. ఆదివారం కావడంతో అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని దర్శించుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చేవారి సంఖ్య అధికంగా ఉండడం, తిరుగు ప్రయాణం కోసం మరలా కాంప్లెక్స్‌కు ప్రయాణికులు చేరుకోవడంతో కాంప్లెక్స్ కిటకిటలాడింది. అందుకు తగ్గట్లు బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడాల్సి వచ్చింది.

– శ్రీకాకుళం అర్బన్

• పారదర్శకంగా సరుకుల పంపిణీ



రేషన్ సరుకుల పంపిణీ పారదర్శకంగా జరగాలని శ్రీకాకుళం మండల పౌరసరఫరాల ఉప తహశీల్దార్ చక్రవర్తి అన్నారు. జూన్ ఒకటో తేది నుంచి రేషన్ డిపోల వద్దే సరుకులు సరఫరా చేయాలన్నారు. ఈ మేరకు ఆదివారం తహశీల్దార్ కార్యాలయంలో డీలర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ డిపోల వద్ద తాగునీరు, నీడ, బెంచీలు ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. తూనికల యంత్రాలు, ఈ పాస్ మిషన్లు సక్రమంగా పనిచేసేలా సిద్ధం చేసుకోవాలన్నారు. త్వరలోనే అన్ని డిపోలకు రిజిస్టర్లు, స్టాక్ రిజిస్టర్లు అందజేస్తామన్నారు.

–శ్రీకాకుళం రూరల్

ప్రజల్లోకి ప్రభుత్వ వైఫల్యాలు

- సూపర్‌సిక్స్ హామీలు ఎప్పుడు అమలు చేస్తారు?
- కూటమి సర్కారుపై మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ ధ్వజం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

జి.సిగడాం: ఎన్నికల ముందు అనేక హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ధ్వజమెత్తారు. ఆదివారం గేదెలపేటలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోసకారి ప్రభుత్వానికి ప్రజలే తగ్గిన బుద్ధి చెబుతారని అన్నారు. కూటమి సర్కారు ఏర్పడి ఏడాది కావస్తున్నా ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా సక్రమంగా అమలు చేయలేదన్నారు. ప్రజలను మోసం చేయడమే సీఎం చంద్రబాబు నైజమని దుయ్యబట్టారు. పేదల ఇంటికే వెళ్లి నిత్యావసర సరుకులు అందించే ఎండీయూ వ్యవస్థను తొలగించి ఆపరేటర్ల ఉపాధి తొలగించడం దారుణమన్నారు. జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలను పేదలకు దూరం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. పల్లెల్లో వృద్ధులు, వితంతవులు కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నా మంజూరు చేయకపోవడం తగదన్నారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోందన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. కార్యకర్తలు ధైర్యంగా ఉండి ప్రభుత్వం వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు గేదెల నారాయణరావు, వరలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు డోల వెంకటరమణ, గొర్లె శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లల రామకృష్ణారావు, జిల్లా అధికార ప్రతినిధి పిల్లల శివకుమార్, బీసీ సెల్ అధ్యక్షుడు మజ్జి రమేష్,తో లేటి వెంకటరావు, సర్పంచ్‌లు పున్నాన అక్కలనాయుడు, విక్రం కోటిబాబు, ఇల్లాక రాములు, నాయకులు చందరాల రంగారావు, ఇజ్జి గోవిందరావు, బైరెడ్డి విష్ణు, టంకాల సత్యనారాయణ, లోలుగు సూరిబాబు, పాగిరి అప్పలనాయుడు, బాలి అప్పలసూరి, చిక్కాల ధర్మారావు, రాయపురెడ్డి సూర్యనారాయణ, బత్తుల చంద్ర తదితరులు పాల్గొన్నారు.

• కళలను ఆదరించాలి


గురు సత్కారం చేస్తున్న తన్మయ, దర్శిని



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

శ్రీకాకుళం కల్చరల్: ప్రతి ఒక్కరూ కళలను ఆదరించాలని, తద్వారా మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడవచ్చని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని బాపూజీ కళామందిర్‌లో తన్మయ కూచిపూడి డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు గురువులు తన్మయ, దర్శిల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రదర్శన ఇచ్చారు. ఈ సందర్భంగా డీఈవో ఎస్.తిరుమల చైతన్య, గురువు హరి రామమూర్తి(విశాఖ) మాట్లాడుతూ నాట్య కళ ద్వారా మంచి నడవడిక, నిబద్ధత పెరుగుతుందన్నారు. అనంతరం గురువులు హరిరామమూర్తి, నండూరి నాగ వెంకట సత్యభానులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శివశ్రీ నృత్యనికేతన్ వ్యవస్థాపకులు రఘుపాత్రుని శ్రీకాంత్, సాదిరెడ్డి హేమసాయి, బి.లక్ష్మణరావు, పి.మణిశర్మ, శ్రీనివాసరావు, మాలతి తదితరులు పాల్గొన్నారు.

వినాయక మందిరానికి విరాళం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని గుజరాతిపేట తోటవీధిలో వినాయక మందిర పునర్నిర్మాణానికి మావుడూరి వాణి, వేణుగోపాల్ దంపతులు రూ.10,101, కొమ్మాజ్యోస్యుల వాసుదేవరావు దంపతులు రూ.5,001 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ కార్యవర్గం ఎన్నిక


అధ్యక్షురాలిగా ఎంపికైన సింధూరను అభినందిస్తున్న క్లబ్ సభ్యులు

శ్రీకాకుళం అర్బన్: 2025–26 సంవత్సరానికి గాను లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ నూతన అధ్యక్షురాలిగా డాక్టర్ పైడి సింధూర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మెంటార్ లయన్ నటుకుల మోహన్ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలోని క్లబ్ కార్యాలయంలో ఆదివారం నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. క్లబ్ కార్యదర్శిగా టిక్కం రామ్‌గోపాల్, కోశాధికారిగా బరాటం కృష్ణ చైతన్య, వైస్ ప్రెసిడెంట్లు బి.ఉమామహేశ్వరరావు, ఉర్లం శివతేజ ఎన్నికయ్యారు. జూలై1 నుంచి వచ్చే ఏడాది జూన్ 30 వరకు కార్యవర్గం పనిచేస్తుందని జోన్ చైర్మన్ పొన్నాడ రవికుమార్, డీసీ డాక్టర్ బాడాన దేవభూషణరావు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సభ్యులు లయన్ బరాటం లక్ష్మణరావు, ప్రొఫెసర్ డి.విష్ణుమూర్తి, సభ్యులు అంధవరపు ప్రసాద్, నారా ఈశ్వరరావు, ఈశ్వర్, శిల్లా మణి, సీపాన రమేష్, పొడుగు చరణ్, అడపాక శాంతి పాల్గొన్నారు.

బరాటం చెరువులో ఆక్రమణలు గుర్తింపు


బరాటం చెరువును పరిశీలిస్తున్న తహశీల్దార్ చక్రవర్తి

గార: అంపోలు రెవెన్యూ పరిధి శ్రీకాకుళం రూరల్ మండలంలోని సానివాడ గ్రామ సమీపంలోని బరాటం చెరువులో ఆక్రమణలను రెవెన్యూ అధికారులు గుర్తించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆదివారం శ్రీకాకుళం రూరల్, గార రెవెన్యూ సిబ్బంది చెరువు కొలతలు వేసి సరిహద్దులను ఏర్పాటు చేశారు. గతంలో సానివాడ గ్రామస్తులు జిల్లా గ్రీవెన్సులో ఫిర్యాదు చేశారు. సర్వే నంబరు–199లో బరాటం చెరువు 19.53 ఎకరాల విస్తీర్ణంలో ఉండేదని, అందులో 10.53 ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు గుర్తించామని గార తహశీల్దార్ ఎం.చక్రవర్తి అన్నారు. ఈ చెరువు కింద మరికొన్ని చెరువులకు నీరు వెళ్లేందుకు ఉపయోగంగా ఉంటుందని, వెంటనే ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు ప్రారంభిస్తామన్నారు. ఉపాధి హామీ పథకం పనులు వెంటనే చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. కాగా, కొలతలు సమయంలో ఆక్రమణదారులకు చెందిన సానుభూతిపరులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. సాగు చేసుకునేందుకు ప్రభుత్వం భూమి పట్టాలు మంజూరు చేసిందని తెలిపారు. వీటిని పరిశీలించిన తహశీల్దార్ అడంగల్‌లో నమోదు చేయలేదని, వాటిని అలా చేసి ఉంటే చూపించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ డి.రాజేంద్ర, వీఆర్‌వోలు మోహన్, హర్ష, సర్వేయర్లు శ్రీనివాస్, ఉమ, ఫీల్డ్ అసిస్టెంట్ రుప్ప జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

శివాలయాల్లో మాస శివరాత్రి శోభ


ఉమారుద్ర కోటేశ్వరస్వామికి హారతి


రాజరాజేశ్వరునికి అలంకరణ


శివకామేశ్వరునికి అలంకరణ


ఉమాజఠలేశ్వరునికి అభిషేకాలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పలు శివాలయాలలో ఆదివారం మాస శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. గుడివీధిలోని ఉమారుద్ర కోటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో స్వామివారిని విశేషంగా అలంకరించి అభిషేకాలు చేశారు. నక్కవీధిలోని ఉమాజఠలేశ్వరస్వామి దేవాలయం, గుజరాతిపేటలోని శ్రీరాజరాజేశ్వరి మహాత్రిపుర సుందరీ దేవీపీఠం, మొండేటివీధిలో షిరిడిసాయి సేవా సంఘం ఆధ్వర్యంలో లలితా సమేత శివకామేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మొక్కలకు దిక్కెవరు?

- ఆర్భాటంగా ఏర్పాటు చేసిన కార్పొరేషన్ అధికారులు
- నిర్వహణను గాలికొదిలేసిన వైనం


వైఎస్సార్ కూడలి నుంచి పాతబస్టాండ్ వెళ్లే రోడ్డులో పాడైన మొక్కలు


డివైడర్‌పై మొక్కల దుస్థితి..


మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ చాంబర్ పక్కనే ఎండిన మొక్కలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగర పరిధిలో మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కలు ఎండిపోతున్నాయి. నిర్వహణను గాలికొదిలేయడంతో కొన్నిచోట్ల పశువులు తినేస్తుండగా.. మరికొన్ని చోట్ల నీరు లేక చనిపోతున్నాయి. సాక్షాత్తు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ చాంబర్ వద్దనే మొక్కలు ఎండిపోతున్నా పట్టించుకున్న వారే కరువయ్యారు. వైఎస్సార్ కూడలిలో డివైడర్ల మధ్య ఏర్పాటు చేసిన మొక్కల్లో కొన్ని కుండీల్లో ఉంటే, మరికొన్ని మట్టితో నేలపైనే ఊగిసలాడుతున్నాయి. మొక్కల్ని పరిరక్షించాల్సిన అధికారులు వాటి నిర్వహణను గాలి కొదిలేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పర్యావరణం కాపాడుకోవాలంటే తప్పనిసరిగా ప్రతి ఒక్కరు మొక్కల్ని సంరక్షించాల్సిన అవసరం ఉంది. మున్సిపల్ అధికారులతో పాటు ప్రజలు సైతం బాధ్యతగా వ్యవహరిస్తే తప్ప మొక్కల సంరక్షణ సాధ్యపడదని అధికారులు చెబుతున్నారు. రోడ్లపై విచ్చలవిడిగా పశువులు వదిలేయడంతో డివైడర్ల మధ్యలో ఉండే మొక్కలు ఎండిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మొక్కల సంరక్షణపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

చర్యలు చేపడతాం.

మొక్కల్ని రక్షించాల్సిన అవసరం ఉంది. ఎక్కడ మొక్కలు పాడైనా వాటిని రక్షిస్తాం. పౌరులు కూడా బాధ్యతగా వ్యవహరిస్తూ మొక్కల సంరక్షణకు తమవంతు కృషి చేయాలి.

– పి.వి.వి.డి ప్రసాదరావు, కార్పొరేషన్ కమిషనర్, శ్రీకాకుళం

పశువులు తినేస్తున్నాయి..



నేటి కాలుష్య ప్రపంచంలో మొక్కల్ని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంది. నగరంలో పలుచోట్ల మొక్కలు పూర్తిగా పాడయ్యాయి. పశువులు విచ్చలవిడిగా తిరుగుతూ డివైడర్ల మధ్య మొక్కల్ని తినేస్తున్నాయి. పశువుల్ని నియంత్రించాలి.

– బి.మధు, శ్రీకాకుళం

గ్రామాభివృద్ధే లక్ష్యం


ఆలయం వద్ద పేడాడ శ్రీరామమూర్తి, గ్రామస్తులు

జి.సిగడాం: గ్రామంలో మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేయడమే లక్ష్యమని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పేడాడ శ్రీరామమూర్తి అన్నారు. ఆదివారం దవళపేట దళిత వాడలో లక్ష్మి, పాపమ్మ, అప్పలనరసమ్మ పేరంటాల ఆలయం పునః ప్రతిష్ఠాపనోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడి, బడి, పేదల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు బొడ్డేపల్లి ఉదయ్‌కుమార్, కంచరాన రమణరావు, మాజీ డైరెక్టర్ పేడాడ శ్యామరావు, పేడాడ కృష్ణంరాజు, పేడాడ స్వాతినాయుడు, పేడాడ నారాయణరావు, తలే చిన్నారావు, కేత నారాయణరావు, బోర రాము, కేత సూర్యారావు, కేత శ్రీనివాసరావు, అసిరి నాయుడు, అప్పారావు పాల్గొన్నారు.